క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

మదనపల్లె సిటీ: స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రెడిట్ యాక్సిస్ లిమిటెడ్, మెడ్‌ప్లస్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు చదువుకొన్న 18–30 వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 9553202509ను సంప్రదించాలని కోరారు.

టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు

బి.కొత్తకోట: మండలంలోని దిన్నిమీదపల్లి వద్ద బైక్‌ను ఢీకొని ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. ఈనెల 21న గుట్టపాళెంకు చెందిన రవీంద్రరెడ్డి కుమారుడు యశ్వన్‌రెడ్డికి జ్వరంగా ఉండటంతో వైద్యం కోసం బైక్‌పై బి.కొత్తకోటకు వస్తున్నారు. వీరు దిన్నిమీదపల్లి వద్దకు రాగానే వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో యశ్వన్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదంపై రవీంద్రరెడ్డి తండ్రి రెడ్డెప్పరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి మృతిపై కేసు

పీలేరురూరల్ : వృద్ధురాలి మృతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని రేగళ్ల పంచాయతీ యల్లంపల్లెకు చెందిన మునిబాయమ్మ (70) కుమారుడు అయిన చెంగల్‌రాయుడుకు పార్వతి, జగదీశ్వరి ఇద్దరు భార్యలు ఉన్నారు. ఆమె చిన్న కోడలు జగదీశ్వరితో గొడవపడ్డారు. ఈ క్రమంలో మునిబాయమ్మ అస్వస్థతకు గురైంది. ఆమెను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. పెద్ద కోడలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రేపటి నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ పార్వతీ సమేత సంఘమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త శ్రీ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న అంకురార్పణ, ధ్వజారోహణం, 26న మహా రుద్రాభిషేకం, స్వామి వారి కళ్యాణోత్సవం, 27న బ్రహ్మ రథోత్సవం, 28న పార్వేటోత్సవం, రాత్రికి అన్నమయ్య సంకీర్తనలు, మార్చి 1న వసంతోత్సవం, శయనోత్సవం, 2న స్వామి వారి విశ్వరూప దర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా లోకనాథం



పీలేరు : వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పీలేరు పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన సి. లోకనాథంను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటు

పీలేరురూరల్ : ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటుఅని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ షేక్ దావూద్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మూడు వారాలుగా గ్రూపు–2 అభ్యర్థుల అభ్యంతరాలు వింటున్నట్లు నటించి నిలువునా మోసం చేశారని ఆరోపించారు. గ్రూపు–2 పరీక్ష వాయిదా వేస్తున్నామని చెప్పడం, మరోవైపు తమ చేతుల్లో ఏమీ లేదని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆందోళన చేసిన అభ్యర్థులపై పోలీస్ లాఠీచార్జిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న అభ్యర్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్యశిబిరం



కలికిరి: అరబిందో ఫార్మా వారి ఆర్థిక సాయంతో శ్రీనివాసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని మేడికుర్తిలో ఆదివారం సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరానికి హాజరైన తిరుపతి మెడిగో ఆసుపత్రి గైనిక్ వైద్యులు, సిబ్బంది 75 మంది మహిళలకు పాప్‌స్మియర్ టెస్టులు నిర్వహించారు. గర్భాశయ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శ్రీనివాసా చారిటబుల్ ట్రస్టీ డా. పీవీ బ్రహ్మారెడ్డి, సభ్యులు శ్రీనివాసరెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి, వైద్యులు షమీమ్, జిలానీ, షబ్బీర్, బాషా పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభో శంకర

- ప్రకృతి అందాల్లో శ్రీ భ్రమరాంభ సమేత మల్లికార్జునుడు
- దక్షిణ కైలాసంగా వెలుగుతున్న మల్లయ్యకొండ



భ్రమరాంభసమేత మల్లికార్జునస్వామి ఆలయం



శివలింగం

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని సాధు, ఇనుము, మల్లయ్యకొండ మూడు కొండల సముదాయం. ప్రకృతి అందాలతో ఆకర్షణీయమైన మల్లయ్యకొండపై శ్రీ భ్రమరాంభ సమేత మల్లికార్జునుడు కొలువుదీరాడు. నాటి చోళరాజుల కాలంలో ఏకిల దొరలచే సముద్ర మట్టానికి 1500 అడుగుల ఎత్తున ఈ ఆలయాన్ని నిర్మించారు. పెద్దిరెడ్డి కుటుంబం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడి ద్వారకనాథరెడ్డి కృషి ఫలితంగా ఆలయాన్ని పునఃనిర్మించి రోడ్డు సౌకర్యం కల్పించి చేసిన అభివృద్ధి చరిత్రలో మరువురాని అధ్యాయంగా నిలుస్తోంది. మహాశివరాత్రి పర్వదినాన మూడు రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచే కాకుండా వైఎస్సార్ కడప ,అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. మహిమాన్వితుడిగా మల్లన్నస్వామి భక్తుల కోరిన కోర్కెలు తీర్చి భక్తుల కొంగుబంగారంగా నిలవడం ప్రజల అపార నమ్మకం.

దర్శనీయ స్థలాలు

మల్లయ్యకొండ కింద నేల మల్లేశ్వరస్వామి ఆలయ ముఖ ద్వారం నుంచి భక్తులు మల్లయ్యకొండకు బయలు దేరుతారు.

ఏనుగుమల్లమ్మ

కొండకు వెళ్లే మార్గమధ్యంలో స్వామి సోదరి ఏనుగుమల్లమ్మ కొలువై ఉంది. స్వామి ఆదేశం మేరకు భక్తుల నుంచి తొలి పూజ అమ్మవారు అందుకుంటారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలతో మొక్కులు తీర్చుకుంటారు.

ఎలుక తీర్థం

కొండకు వెళ్లే దారిలో ఎలుక తీర్థం ఉంది. ఇక్కడ నాగదేవతలు పూజలు అందుకుంటారు. రాతిబండలో ఎలుక తోకలాగా నీటి ధార ఎప్పుడు రావడం విశేషం. భక్తులు ఇక్కడ పూజలు నిర్వహించి ఆ జలాన్ని తీర్థంగా సేవిస్తారు.

భగీరథ చలం (కోనేరు)

కొండపై భగీరథచలం (కోనేరు) ఉంది. భక్తులు స్వామి తలనీలాలు సమర్పించి ఈ కోనేరులో స్నానం ఆచరించి స్వామి దర్శనంకు వెళతారు.

వీరన్న గెవి

ఆలయానికి తూర్పుదిశగా వీరన్నగెవి (గుహ) ఉంది. స్వామి సాధుకొండ నుంచి పల్లెలుక, ఎల్లెలుక తోడుగా ఈ సొరంగ మార్గం నుండి మల్లయ్యకొండకు చేరినట్లు చెబుతారు. ఇక్కడ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

గౌరమ్మ గుడి

ఆలయాన్ని ఉత్తర దిశలో అర కిలో మీటరు దూరంలో ఒక రాతి బండలో గౌరమ్మ గుడి ఉంది. స్వామిపై గౌరమ్మ అలకబూని ఇక్కడికి వచ్చి స్థిరపడినట్లు కథనం. ఇక్కడికి మహిళలు సంతానం కోసం, వివాహం కాని యువతులు కోనేటిలో స్నానం ఆచరించి అమ్మవారికి వరపడతారు. గుడి దగ్గర ఉన్న చెట్టుకు ముడుపులు (ఊయలలు) కట్టి చిన్నరాళ్లను ఒకదానిపై పేర్చి కోర్కెలు తీరాలని మొక్కుకుంటారు. సంతానం కలిగితే గౌరమ్మ, మల్లమ్మ, మల్లికార్జున, మల్లన్న వంటి పేర్లు పెట్టుకుంటారు. ఈ ఆలయం పైభాగంలో వ్యూపాయింట్ ఉంది. ఇక్కడికి సుమారు 150 కిలో మీటర్ల దూరంలో ఉన్న తిరుమల కొండల వెలుగు దర్శనం ఇవ్వడం విశేషం.

నిచ్చెన కొండ

ఆలయానికి దక్షిణ దిశగా బండరాతిలో ఏకధాటిగా నీటిధార రావడం విశేషం. 20 అడుగుల ఎత్తులో బండరాతిలో స్వచ్ఛమైన నీటి ధార వచ్చి చలంగా ఉంటుంది. ఈ నీటినే రోజు స్వామి అభిషేకం వినియోగిస్తారు. భక్తులు నిచ్చెనద్వారా ఎక్కి ఈ జలాన్ని తీర్థంగా సేవిస్తారు. రాతి బండ నుంచి నీరు రావడంతో ఔషధగుణాలు కలిగి ఉంటాయని దీర్ఘకాలిక వ్యాధులు, చర్మవ్యాధులు నయమవుతాయని భక్తుల నమ్మకం.

మల్లయ్య దేవరలు

మహాశివరాత్రికి 60 రోజులు ముందుగానే మల్లయ్యదేవర్లు నల్లటి ఆకర్షణీయమైన దుస్తులు తలపై ఎలుగుబంటి చర్మం టోపీ, వీబూది ధరించి డమ్ము రకం వాయిస్తూ పిల్లగ్రోవి ఊదుతూ శివతాండవ నృత్యం చేస్తూ మహాశివరాత్రి ఉత్సవాలను భక్తులను ఆహ్వానిస్తారు. పల్లెల్లో ప్రతి ఇంటి ముంగిట ప్రత్యేక పూజలు చేసి బిక్ష అందజేస్తారు. ఆ ఢమురక శబ్దంతో ఆరోగ్య పాడి పంటలతో కళకళలాడుతాయని ప్రజల నమ్మకం.

అన్నదానం ట్రస్టు

మహాశివరాత్రికి బ్రహ్మోత్సవాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్నదాన ట్రస్టు ద్వారా దాతల ఆర్థిక సహకారంతో రుచికరమైన వంటకాలతో అన్నదానం చేస్తారు.



ప్రత్యేక అలంకరణలో ఏనుగుమల్లమ్మ



ఎలుక తీర్థం



భగీరథ చలం(కోనేరు)



వీరన్నగెవి

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్లో 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివకుమారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సూచించారు. ప్రస్తుతం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పరీక్షా రుసుం చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్చి నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని పరీక్ష విధానం ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

యోగభోగేశ్వరుడికి వెండి వస్తువులు బహూకరణ



వెండి వస్తువులను అందజేస్తున్న దాత చంద్రమౌళి దంపతులు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం బెంగళూరు రోడ్డులోని శ్రీయోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మౌళి మెడికల్స్ అధినేతగార్ల చంద్రమౌళి,మహేశ్వరి దంపతులు స్వామికి రూ.2.50 లక్షలు విలువ చేసే వెండి హారతులు బహూకరించారు. ఆలయ ఈఓ రమణ సమక్షంలో కుంభహారతి, నక్షత్రహారతి,కర్పూర హారతితో పాటు స్వామికి హారతులు ఇచ్చే వెండి ఆభరణాలు ఇచ్చారు. దాతలను ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వర ప్రసాద్ స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రలోభాలు..అభివృద్ధికి ఆటంకాలు

- ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం
- మద్దతు పలికిన మరో ఎంపీటీసీ
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వెంటే ఉంటాం



మాట్లాడుతున్న ఎంపీటీసీ ఈశ్వరమ్మ

బి.కొత్తకోట: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలంటే ఆటంకాలు కల్పిస్తూ..పార్టీ మారాలంటూ ప్రలోభాలు పెట్టడంవల్లే తామంతా ఎంపీపీ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చిందని బి.కొత్తకోట మండలానికి చెందిన 10 మంది ఎంపీటీసీలు మూకుమ్మడిగా పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని ఊడిగపల్లిలో కోటావూరు ఎంపీటీసీ, మాజీ వైస్ఎంపీపీ బూదల ఈశ్వరమ్మ స్వగృహంలో వారంతా సమావేశమయ్యారు. మండలంలో నెలకొన్న పరిస్థితులు, ఆగిన అభివృద్ధి పనులపై చర్చించుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆశీస్సులతో తామంతా ఎంపీటీసీలయ్యామని అన్నారు. గుమ్మసముద్రం ఎంపీటీసీగా లక్ష్మీనరసమ్మను ఎంపీపీగా ఎమ్మెల్యే ఎంపిక చేయడంతో తామంతా ఆమెను ఎన్నుకున్నట్టు చెప్పారు. అయితే ఇటీవల ఎంపీపీ ధోరణిలో మార్పు వచ్చిందన్నారు. ఎంపీటీసీలుగా తమను గుర్తించి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదన్నారు. దీనికి తగ్గట్టుగా గ్రామాల్లో అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనుల ప్రతిపాదనలను ఇస్తే వాటిని పట్టించుకోకుండా మండల పరిషత్ సమావేశాల్లో అజెండాలో పెట్టనివ్వకుండా చేస్తున్నారని ఆరోపించారు. దీనితో పనులకు ఆమోదం లభించనీకుండా చేస్తూ ప్రజల్లో తమపట్ల చులక భావం ఏర్పడేలా వ్యవహరిస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్‌లో నిధులు పుష్కలంగా ఉన్నప్పటికి వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నామన్నారు. నిధులు మురిగిపోతున్నాయి తప్ప అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ఎంపీపీ ఆమోదం ఇవ్వడం లేదన్నారు. అభివృద్ధికి సహకరించకుండా ఇబ్బందులు గురిచేసినా సర్దుకుపోయామని, గౌరవించకున్నా పట్టించుకోలేదన్నారు. చివరకు వైఎస్సార్‌సీపీని వీడి రావాలని తమను ఎంపీపీ ప్రలోభపెట్టారని ఆరోపించారు. పార్టీ మారితే అభివృద్ధి పనులు మంజూరు చేయిస్తానని చెప్పడం అవిశ్వాసానికి దారితీసిందన్నారు. తమకు రాజకీయ భవిష్యత్తు లేకపోయినా పర్వాలేదు పార్టీ మారే ప్రసక్తే లేదని వారు పేర్కొన్నారు. మండల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఎంపీపీపై అవిశ్వాస తీర్మాణ నోటీసు ఇచ్చామని ప్రజలు గమనించాలని కోరారు. తమకు రాజకీయ భిక్ష పెట్టిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని వీడమని, ఆయన వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు ఎస్.రాధ, వి.ఖాదర్‌వలీ, ఎంపీటీసీలు ఎ.గౌతమి, ఎ.రమాదేవి, బి.ఈశ్వరమ్మ, వి.రామసుబ్బారెడ్డి, సి.ఎల్లప్ప, ఎ.సుబ్బయ్య, సి.విమలమ్మ , ఆకుల బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ రామచంద్ర, సర్పంచు నాగిరెడ్డి, నాయకులు సురేంద్రనాథ్, ఎ.శివారెడ్డి, ఎ.జయరామిరెడ్డి, సుబ్బారెడ్డి, దాదం లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

మిగిలింది ఎంపీపీ ఒక్కరే :

ఈనెల 10న ఎంపీపీ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మాణ నోటీసులో బయ్యప్పగారిపల్లి ఎంపీటీసీ అనగాని రమాదేవి సంతకం చేయలేదు. అయితే అవిశ్వాసానికి మద్దతు తెలుపుతూ ఎంపీటీసీల సమావేశానికి హాజరయ్యారు. దీనితో మొత్తం 11 మంది ఎంపీటీసీల్లో 10 మంది ఒకవైపునకు వచ్చారు. దీనితో ఎంపీపీ ఒక్కరే మిగిలారు.

నాణ్యాత ప్రమాణాలతో విద్యాబోధన

మదనపల్లె సిటీ: నిమ్మనపల్లె మండలం మాచిరెడ్డిగారిపల్లెలో ఆదివారం ఏడిపై సీబీఎస్‌సి పాఠశాలను ఆదివారం పాఠశాల డైరెక్టర్ అగర్వాల్ ప్రారంభించారు. అత్యుత్తు నాణ్యాత ప్రమాణాలతో పాఠశాలలో విద్యా బోధన ఉంటుందన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. 1వ తరగతి నుంచి 5వతరగతి వరకు అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యాబోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గోపికృష్ణ, బీటీ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపల్ తులసీరామ్‌నాయుడు, చైర్మన్ రమేష్‌నాయుడు, ఇన్‌స్టిట్యూషన్ హెడ్ సుష్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో రాణించాలి



షాప్ ప్రారంభిస్తున్న దివ్యజ్ఞానానందగిరిస్వామి

మదనపల్లె సిటీ: ఏఎస్ఆర్ శిల్క్, టెక్స్‌టైల్స్ వారు వ్యాపార రంగంలో రాణించాలని అఖిల భారత తొగటవీరక్షత్రియ కులగురువులు శ్రీ దివ్యజ్ఞానానందగిరిస్వామి ఆకాంక్షించారు. ఆదివారం మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరినగర్‌లోని ఏఎస్ఆర్ శిల్క్, టెక్స్‌టైల్స్‌ను ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు శీలం రమేష్‌బాబు, శీలం రమణమ్మలు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పట్టుచీరల వ్యాపారంతో ఎంతో పేరుప్రఖ్యాతులు గడించినట్లు తెలిపారు. నాణ్యమైన కంచి పట్టుచీరలు, ధర్మవరం, పోచంపల్లి, వెడ్డింగ్‌శారీస్, చుడీదార్,లేడీస్‌వేర్, జెంట్స్‌వేర్, కిడ్స్‌వేర్ సరమైన ధరలకు లభిస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్‌తో పాటు తొగటవీరక్షత్రియ సంఘ నాయకులు ఉప్పు రామచంద్ర, పురాణం చంద్రశేఖర్, నీలకంఠ పాల్గొన్నారు.

సింహగర్జన జయప్రదం చేయండి

పీలేరు : వచ్చే నెల 23న తిరుపతిలో నిర్వహించనున్న రాయలసీమ మాలల సింహ గర్జన జయప్రదం చేయాలని మాల మహానాడు నాయకులు ధరిణికుమార్, సుభాష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానక అంబేడ్కర్ సర్కిల్ వద్ద సింహగర్జన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఆ తీర్పును పునఃపరిశీలించాలని డిమాండ్ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణ, ఆనంద్, ద్వారక, పురుషోత్తం, దామోదరం, రాజేంద్రబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేయాల్సిందే

- రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్ చేసిన బీసీ నేతలు
- మదనపల్లి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి
- బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చందు



బీసీ డిక్లరేషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మదనపల్లె: బీసీ కులగణన చేయాల్సిందేనని రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బీసీ కుల,జన గణనపై రౌండ్ టేబుల్ సమావేశం బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చందు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకి వచ్చినా, రాష్ట్ర, కేంద్ర, విద్యా, ఉద్యోగ రంగాలలో వెనుకబడిన వర్గాల ప్రజలకు జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం అందలేదన్నారు. ఆర్టికల్ 15, 16 రూపకల్పన జరిగి విద్యా ఉద్యోగ రంగాల్లో బీసీ జనాభా సంఖ్యలో సగం మాత్రమే వాటా లభిస్తుందన్నారు. జనాభా లెక్కించకుండా, బీసీల సంఖ్యాబలాన్ని బయట పెట్టకుండా జనాభా నిష్పత్తి కంటే తక్కువ అవకాశాలు రావడం అణిచివేతకు కారణం అవుతుందన్నారు. ప్రధానమంత్రి బీసీ అయినప్పుడు దేశంలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేసి వారి బీసీల నిజాయితీని చాటుకోవాలన్నారు. దేశంలో జంతువులకు లెక్కలు ఉన్నాయి కానీ, బీసీలకు ఎలాంటి లెక్కలు లేవని ఆవేదన చెందారు. రాష్ట్రంలో మురళీధర్ రావు కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 14 పాయింటులతో బీసీ డెకరేషన్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్ , మీనా కుమారి , జబ్బల శ్రీనివాస్ , దుడం రెడ్డి బాబు , సిపిఐ సాంబశివ, సిపిఎం శ్రీనివాసులు, బిజెపి బండి ఆనంద్, టిడిపి బీసీ సెల్ రెడ్డి ప్రసాద్ వాల్మీకి సంఘం పులి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే గ్రాండ్‌మాస్టర్ మృతికి సంతాపం



సురేష్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న నిస్సార్ అహ్మద్

మదనపల్లె: మదనపల్లె పట్టణం సొసైటీకాలనీకి చెందిన ప్రముఖ కరాటే గ్రాండ్‌మాస్టర్, సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ ఏఆర్ సురేష్(57) ఆదివారం తెల్లవారుజామున తీవ్ర అనారోగ్యంకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మదనపల్లె యూత్ కరాటే క్లబ్ ఏర్పాటు చేసి పలువురి విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చారు. బీసీ సంఘ నాయకుడికి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన ఓ ఎల్రాానికల్ మీడియాలో పాత్రికేయుడిగా పని చేస్తున్నారు. ఆయన మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ మృతదేహానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాంచినబాబు, జనసేన రాయలసీమ కోఆర్డినేటర్ రాందాస్‌చౌదరి వివిధ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సంతాపం ప్రకటించి వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మదనపల్లె ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, కిరణ్, సీనియర్ పాత్రికేయులు నివాళులు అర్పించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వివాహ కార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. శనివారం రాత్రి పీలేరు పట్టణం ఎంఎస్ఆర్ గార్డెన్ కళ్యాణ మండపంలో ప్రధానోపాధ్యాయుడు చెంగల్ రెడ్డి కుమారుడు ఎస్.భార్గవ్ తేజ్ వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, అభినందనలు తెలిపారు. వాల్మీకిపురం పట్టణ పరిధిలోని ఆర్ఎంఎం కింగ్ ప్యాలెస్‌లో పార్యంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పసల రామక్రిష్టారెడ్డి కుమారుడు ప్రసన్నకుమార్‌రెడ్డి వివాహ కార్యక్రమానికి, అలాగే టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన స్థానిక తొగటవీధికి చెందిన సోంపల్లె చిన్నరెడ్డెప్ప కుమారుడు నవీన్ వివాహ కార్యక్రమాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఘనంగా సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ట



సీతారామలక్ష్మణ విగ్రహాల ఊరేగింపు

కలకడ : మండలంలోని ఎనుగొండపాళ్యెం పంచాయతీ బద్దిరెడ్డిగారిపల్లెలో గ్రామస్తులందరూ కలిసి గ్రామంలో నూతన ఆలయం నిర్మించి సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ట చేయించారు. శనివారం రాత్రి నూతన విగ్రహాలను అలంకరించి చాందినీ బండిపై గ్రామ పురవీధులతో పాటు, కుమ్మరపల్లె, ఎగువపాళ్యెం, తదితర గ్రామాలలో ఊరేగించారు. గ్రామ వీధులలో ఇంటింటి పూజలు అందుకున్న స్వామివారిని ఆదివారం తెల్లవారు జామున ప్రతిష్ఠించారు.

శివరాత్రికి బండన్న ఆలయంలో భారీ ఏర్పాట్లు



బండెన్నస్వామి ఆలయంలోని శివుడి విగ్రహాలు

బి.కొత్తకోట: మండలంలోని బీరంగి గ్రామం బండెన్న స్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బండెన్న స్వామి ఆలయ ప్రాంగణంలో 235 దేవతా విగ్రహాలు కొలువై ఉన్నాయి. అడుగడుగునా శివలింగాల ప్రతిష్ట, మధ్యలో రెండు వైపులా భారీ శివుని విగ్రహాలను ప్రతిష్టించడంతో పాటు స్పటిక లింగ ఆలయాన్ని నిర్మించారు. ఆకాశాన్నంటేలా కనిపించే 50 అడుగుల ఎత్తయిన మహాశివుని విగ్రహాలు ఆలయానికి ప్రత్యేకం. ఈ విగ్రహాలతో పాటు స్పటికలింగ ఆలయాన్ని, మొత్తం దేవతా విగ్రహాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. శివరాత్రిరోజు బుధవారం ఇక్కడికి 25వేల మందికి పైగా భక్తులు దర్శనం కోసం వస్తారని అంచనా వేసి అందుకుతగ్గ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి స్వామి చెప్పారు. శివరాత్రిరోజు ప్రత్యేక కార్యక్రమాలతోపాటు శివపార్వతుల కళ్యాణోత్సవ వేడుకను నిర్వహించి ఇక్కడికి వచ్చే భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలను అందిస్తున్నట్టు చెప్పారు. గురువారం ఆలయంలో భరతనాట్యం, భజనలు, అన్నమాచార్య సంకోర్తనల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని లక్ష్మీపతిస్వామి తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మద్గుండాల మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీఐ యుగంధర్

పీలేరు రూరల్ : మహాశివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ యుగంధర్ అన్నారు. ఆదివారం మండంలోని తలపుల పంచాయతీ అడవిపల్లెలో వెలసి శ్రీ మద్గుండాల మల్లేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి రోజుపాటు, ఝురి ఉత్సవం సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిర్వాహకులు జ్యోతుల మురళీ నాయుడు మాట్లాడుతూ ఈ నెల 26 బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, పూజా కార్యక్రమాలు, సాయంత్రం పార్వతీపరమేశ్వరుల ఊరేగింపు, రాత్రి జాగారం ఉంటుందని చెప్పారు. 27న గురువారం ఝురిస్నానాలు, సిద్ధపూజ, మొక్కుబడులు, వరపడుట, నాణెలు, దేవరెద్దులు, భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రాత్రి భక్తుల కాలక్షేపానికి వెంకటేశ్వరనాట్య కళామండలిచే ద్రౌపది మానసంరక్షణ వీధి నాటకం ఉంటుందని చెప్పారు. రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పీలేరు నుంచి మద్గుండాల మల్లేశ్వరస్వామి ఆలయం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉన్నట్లు చెప్పారు.

IN THE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE, MADANAPALLE

O.S. No: 288/ 2024

Plaintiff: **A. Surya Prakash Reddy**

V/s

Defendant: **L.Venkatramana**

SUMMONS TO DEFENDANT

L.Venkatramana,S/o B.Brahmaiah, Chinthamakulapalle, Nadimikhandrika Village, Gurramkonda Mandal, Annamaiah District

Sir

Please take Summons that the plaintiff has filed the above suit for recovery of suit amount against you. The above suit is posted to 10.03.2025 for your appearance at 10.30 A.M. Hence you can appear either personally or through your counsel and file your objections if any, before the court failing which the matter will be decided exparte against you.

// By order of the Court //

B.VENUGOPAL, B.Com., LL.B.,
Advocate for Plaintiff, Madanapalle.